# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ బుధవారం 26 జూన్ 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:01 సంచిక: 320

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD





## బాలికను గంజాయి మత్తులో దింపి అత్యాచారం

## రైతు సంక్షేమం లక్ష్యంగా కెసిఆర్ రైతుబంధు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



హైదరాబాద్:రైతు సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ విప్లవాత్మక పథకాలు అమలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దేశంలోనే తొలిసారి కేసీఆర్ హయాంలో రైతు బంధు అమలు చేశామన్నారు. ఫార్మర్ ఫస్ట్ అనేది కేవలం నినాదం కాదని, దీనికి కొన్ని విప్లవాత్మక విధానాలు మద్దతుగా నిలిచాయని చెప్పారు. అది కేసీఆర్ ప్రభుత్వం సాధించిన గొప్ప విజయం అని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతు మరణాలు తగ్గడంపై అరవింద్ వారియర్ అనే నెటిజన్ చేసిన ట్వీట్‌కు కేటీఆర్ స్పందించారు. తాము తీసుకొచ్చిన పథకాల గురించి వెల్లడించారు. 70 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్లు ఖాతాల్లో వేశామన్నారు. ప్రతి రైతుకు రైతు బీమా పేరుతో రూ.5 లక్షల జీవిత బీమా కల్పించామని తెలిపారు. రూ.25 వేల కోట్లతో రుణమాఫీ అమలు చేశామని వెల్లడించారు. 24 గంటల ఉచిత విద్యుత్ అందించామన్నారు. మిషన్ కాకతీయలో భాగంగా వేల చెరువులను పునరుద్ధరించామని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ వంటి భారీ ప్రాజెక్టులను నిర్మించామని చెప్పారు.


# ఎన్‌హెచ్ఎం నిధులు విడుదల చేయండి

## కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ వినతి

## రాహుల్ గాంధీ, రాష్ట్ర ఎంపీల ప్రమాణానికి సీఎం హాజరు



**జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్ఎం) కింద తెలంగాణకు రావాల్సిన రూ.693.13 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు.**



దిల్లీ:కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి జేపీనడ్డాకు పుష్పగుచ్ఛమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్ఎం) కింద తెలంగాణకు రావాల్సిన రూ.693.13 కోట్ల పెండింగ్ నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. ఆయన మంగళవారం దిల్లీలోని పార్లమెంటు భవనంలో కేంద్రమంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో వైద్యసేవలను మెరుగుపరిచేందుకు, ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలను కేంద్రమంత్రికి వివరించారు. ఈ ఏడాది జనవరి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం నిబంధనలన్నింటినీ అమలు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యసేవలు అందించేందుకు 5,519 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్‌హెచ్ఎం పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.323.73 కోట్లు, 2024-25లో మొదటి త్రైమాసికానికి సంబంధించి రూ.138 కోట్లు, 2023-24లో రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సిన రూ.231.40 కోట్లు కలిపి మొత్తం రూ.693.13 కోట్లు రావాల్సి ఉన్నట్లు కేంద్రమంత్రికి విన్నవించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆలస్యమైనా అత్యవసర వైద్యసేవలకు అంతరాయం కలగకుండా, సిబ్బంది ఇబ్బందులు పడకుండా 2023 అక్టోబరు నుంచి రాష్ట్ర వాటాతోపాటు కేంద్ర వాటానూ తామే విడుదల చేస్తూ వస్తున్నామని జేపీ నడ్డా దృష్టికి ముఖ్యమంత్రి తీసుకొచ్చారు. అందువల్ల రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి ఉన్నారు.

ఎంపీల ప్రమాణానికి హాజరైన సందర్భంగా లోక్‌సభ లాబీలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ప్రియాంకా గాంధీ

గ్యాలరీ నుంచి తిలకించి..

తెలంగాణ ఎంపీలు, రాహుల్‌గాంధీ ప్రమాణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. 18వ లోక్‌సభ సభ్యులుగా వారి ప్రమాణాన్ని ఆయన లోక్‌సభ గ్యాలరీ నుంచి ప్రత్యక్షంగా చూశారు. ఆయనతోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ఎమ్మెల్యే గడ్డం వివేక్, మాజీ మంత్రి జానారెడ్డి ఉన్నారు. అనంతరం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరైన సోనియాగాంధీ, ప్రియాంకా గాంధీలను కలిశారు.



## డ్రగ్స్ విషప్రయోగంతో సమానం

### డ్రగ్స్ నిర్మూలకు ప్రభుత్వం కఠిన చర్యలు జలవిహార్ వద్ద ర్యాలీని ప్రారంభించిన భట్టి

**హైదరాబాద్:** రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ఏ స్థాయిలో అయినా నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం విషప్రయోగం లాంటిది.. ఇది అత్యంత ప్రమాదకరం. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుందని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. తెలిసీ తెలియని వయసులో వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు కావాలనే తమ అక్రమ సంపాదన కోసం యువతకు డ్రగ్స్ అంటగడుతున్నారు. దేశాన్ని బలహీనపరిచేందుకు దేశద్రోహులు చేస్తున్న ప్రయత్నంగానూ దీన్ని చూడొచ్చని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత మనపైనే ఉంది. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరోకు ఎంత బడ్జెట్ అయినా కేటాయిస్తాం. వాటి వినియోగం, రవాణా లేకుండా చేయాల్సిన బాధ్యత ఆ అధికారులదే. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజల నుంచి కూడా సహకారం అందాలి. డ్రగ్స్ సరఫరా చేసేవారు ఎక్కడున్నా అరెస్ట్ చేసే శక్తి సామర్థ్యాలు పోలీసు వ్యవస్థకు ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇచ్చే వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన కమిటీలు వేయాలి. కొత్త వ్యక్తులపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలి. తాత్కాలిక సంతోషాలకు విద్యార్థులు బలి కావొద్దు. వారు అడ్డదారులు తొక్కితే కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధపడాల్సి ఉంటుందని భట్టి విక్రమార్క అన్నారు. కార్యక్రమంలో సిఎస్ శాంతికుమారి, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'జగిత్యాల జగడం'..

### జీవన్ రెడ్డికి కేసీ వేణుగోపాల్ బంపరాఫర్?

- జీవన్‌రెడ్డికి కాంగ్రెస్ అధినాయకత్వం బుజ్జగింపు
- ఫోన్ చేసి మాట్లాడిన పార్టీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్
- మంత్రి పదవి ఇస్తామని ఆఫర్ ఇచ్చినట్లుగా ప్రచారం
- జీవన్ ఇంటికి వెళ్లి చర్చించిన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు
- రాజీనామా అంశాన్ని ఉపసంహరించుకున్న జీవన్‌రెడ్డి

జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఆఫర్ చేసినట్టు సమాచారం.అనంతరం, జీవన్ రెడ్డి మాట్లాడుతూ..'శాసనమండలి ఛైర్మన్ అందుబాటులో లేరు. ఆయన అందుబాటులోకి రాగానే నా నిర్ణయం చెబుతాను. తొందరలోనే మండలి ఛైర్మన్ దగ్గరికి వస్తాను. రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ నాతో మాట్లాడారు.







## నీట్‌అక్రమాలపై సిబిఐ దూకుడు

# 'విద్యుత్' కమిషన్ విచారణ నిలిపేయండి

కరెంటు కొనుగోలు, విద్యుత్కేంద్రాలపై.. కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధం

ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణాంశాల్లో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ హైకోర్టులో సవాల్ చేశారు.

2లో

- ఆ అధికారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదు
- ఛైర్మన్ ఆ విషయాన్ని సర్కారుకు చెప్పాల్సింది
- విచారణలో నిష్పాక్షికతపై సందేహాలున్నాయి..
- జీవోను రద్దు చేయండి హైకోర్టులో కేసీఆర్ పిటిషన్



## ఎమ్మెల్యేలు పార్టీ మారితే నష్టమేమీ లేదు ...



హైదరాబాద్: ఎన్నికల హామీల అమలులో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని, భవిష్యత్‌లో బీఆర్ఎస్‌కు మళ్లీ మంచిరోజులు వస్తాయని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ పార్టీ ఎమ్మె ల్యేలకు భరోసా ఇచ్చారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పార్టీ మారడాన్ని పట్టించుకోవా ల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలను కాంగ్రెస్ పార్టీ చేర్చుకొని ఉద్యమస్ఫూర్తి ని దెబ్బతీసేందుకు ప్రయత్నించినా వెనుకంజ వేయలేదన్నారు.పార్టీ ఫిరాయింపు వ్యవహారం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో బీఆర్ ఎస్‌కు చెందిన పలువురు శాసనసభ్యు లు, శాసన మండలి సభ్యులు మంగళవారం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఎర్రవల్లి నివాసంలో జరిగిన ఈ భేటీ లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అరడజను మంది ఎమ్మెల్యేలు ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ భేటీలో రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలపై కేసీఆర్ చర్చించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం, క్షీణించిన శాంతిభద్రతలు వంటి అంశాలు కూడా ప్రస్తావనకు వచ్చాయి.

రాష్ట్ర ఏర్పాటు ద్వారా అనుభవం కలిగిన నేతలను పునర్నిర్మాణంలో భాగస్వాము లు చేయాలనే లక్ష్యంతోనే కొందరిని బీఆర్ ఎస్‌లో గతంలో చేర్చుకున్నట్లు కేసీఆర్ చెప్పారు. అధికారం కేంద్రంగా పరిభ్రమించే వ్యక్తులు కొందరు అన్నిచోట్లా ఉంటారని, అలాంటి వారిని సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదని చెప్పినట్టు సమాచారం.




## నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిందే

## విశాఖలో ఎస్ఎఫ్ఐ ర్యాలీ





# ఎమ్మెల్యే సంజయ్ చేరికతో పార్టీలో చిచ్చు

**జగిత్యాల:** కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంపై ఇప్పటికే అసహనంతో ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి పల్లెలన్నీ తిరుగుతానని వెల్లడించారు. ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. అయితే పార్టీ మారే ఆలోచన ఇప్పటివరకు అయితే లేదని పేర్కొన్నారు. అలాగే ఏ పార్టీ నుంచి కూడా ఆహ్వానం లేదన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వచ్చి మాట్లాడారని జీవన్ రెడ్డి తెలిపారు. తనతో కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ దీపదాస్ మున్షీ కూడా మాట్లాడారని పేర్కొన్నారు. బీజేపీ నుంచి ఎవరూ తనను సంప్రదించలేదని స్పష్టం చేశారు. ఏ పార్టీ నుంచి తనకు కాల్స్ రాలేదని తెలిపారు. ఈ స్టేజ్‌లో పార్టీ నుంచి గౌరవం కోరుకున్నా.. కానీ ఈ రోజు తనకు ఆ గౌరవం దక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లు పార్టీ ప్రతి నిర్ణయాన్ని పాటించానని తెలిపారు . నష్టం కలిగినా పార్టీ ఎక్కడ పోటీ చేయాలన్నా చేశానని పేర్కొన్నారు. తన ప్రమేయం లేకుండానే జరగాల్సింది జరిగిందని చెప్పారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సోమవారం శ్రీధర్ బాబు కలిసి బుజ్జగించే ప్రయత్నం చేశారు. కానీ ఆయన లొంగలేదు. '200 కోట్ల రూపాయల నిధులు ఇచ్చి కండువా కప్పడం అవసరమా? ఇప్పుడు ప్రభుత్వానికి ఏమైంది? నా సీనియారిటీ, సిన్సియార్టీకి ఇచ్చే విలువ ఇదేనా? కార్యకర్తల కష్టాలు, మనోభావాలు అక్కర్లేదా?' అంటూ మంత్రి శ్రీధర్‌బాబు ఎదుట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడంపై కినుక వహించిన జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తన ఇంటికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుపై జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు రెండుసార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడండి అంటూ జీవన్‌రెడ్డిని కోరినా, 'మాట్లాడను' అంటూ తిరస్కరించినట్టు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ ఫోన్ చేశారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా కోరినట్లు సమాచారం. హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుతామని మున్షీ చెప్పినట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో మరోసారి జీవన్ రెడ్డితో ఆయన మాట్లాడారు.

# 'విద్యుత్' కమిషన్ విచారణ నిలిపేయండి



హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణాంశాల్లో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేయడాన్ని మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్ హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డితో న్యాయ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ఇంధనశాఖ మార్చి 14న జారీ చేసిన జీవో.. విచారణ కమిషన్ల చట్టానికి, విద్యుత్తు చట్టానికి విరుద్ధమంటూ కేసీఆర్ మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తు కొనుగోళ్లు, సరఫరా ఒప్పందాలు, వివాదాలపై విచారించే పరిధి రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి (ఎస్ఈఆర్సీ)కి మాత్రమే ఉందని పేర్కొన్నారు. విద్యుత్తు చట్టం ప్రకారం కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం ప్రభుత్వ పరిధిలో లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో.. కేంద్రం తీసుకువచ్చిన విద్యుత్తు చట్టంలోని సెక్షన్ 61, 62, 86లకు విరుద్ధమని, దీనిపై రాష్ట్ర సర్కారు అధికారాలు పరిమితమన్నారు. ప్రభుత్వం విచారణకు నిర్దేశించిన అంశాలన్నీ ఎస్ఈఆర్సీ పరిధిలోనివేనని స్పష్టం చేశారు. కమిషన్ విచారణ సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని, కమిషన్ ఏర్పాటు చట్టవిరుద్ధమని సమగ్ర వివరాలతో లేఖ రాసినా ఛైర్మన్‌గా జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కొనసాగడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. లేఖ రాసిన తరువాత కూడా.. తమ ఎదుట హాజరై ఆధారాలను సమర్పించాలంటూ కమిషన్ ఈ నెల 19న జారీ చేసిన ప్రొసీడింగ్స్.. విచారణ కమిషన్ల చట్టం-1952కు విరుద్ధమని, దీన్ని రద్దు చేయాలని కోరారు. ఇందులో ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి, విచారణ కమిషన్, వ్యక్తిగత హోదాలో కమిషన్ ఛైర్మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ పిటిషన్ ప్రస్తుతం హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉంది. పిటిషన్‌లో కేసీఆర్ పేర్కొన్న ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి..

అన్నింటికీ చట్టప్రకారం అనుమతులు

'విద్యుదుత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు అన్ని అనుమతులు తీసుకున్నాం. విద్యుత్తు చట్టం 2003 కింద ఏర్పాటైన ఎస్ఈఆర్సీ సమగ్ర విచారణ జరిపి ఉత్తర్వులు జారీచేసే న్యాయవ్యవస్థ. ఈఆర్సీ జారీ చేసిన ఉత్తర్వులకు రక్షణ ఉంది. వీటిని ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, ట్రైబ్యునల్, కమిషన్, సభ్యులు ఎవరూ ప్రశ్నించడానికి అవకాశం లేదు. ఈఆర్సీ పరిధిలోని అంశాలపై ఎవరికైనా అభ్యంతరాలుంటే అది నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణలో వెల్లడించవచ్చు. ఈఆర్సీ నిర్ణయాలపై అభ్యంతరాలుంటే అప్పిలేట్ ట్రైబ్యునల్‌ను, ఆపై సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు. ఉత్పత్తి, సరఫరా, పంపిణీ తదితర అన్ని అంశాలనూ ఎస్ఈఆర్సీ పరిధిలోనే విచారణ చేయాలి. వీటిపై మరెక్కడా విచారణ చేపట్టరాదంటూ గుజరాత్ ఊర్జా వికాస్ వర్సెస్ ఏఆర్ పవర్ లిమిటెడ్ కేసులో సుప్రీంకోర్టు పేర్కొంది.

వివరాలు ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదు

చట్టప్రకారం ఎస్ఈఆర్సీ వంటి జ్యుడిషియల్ సంస్థ నిర్ణయాలపై ఎలాంటి విచారణ అవసరం లేదని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి నాకు నోటీసు జారీ చేశారు. నేను స్పందించేలోపే జస్టిస్ నరసింహారెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించడం అసంతృప్తి కలిగించింది. ఎంవోయూ కుదుర్చుకునే నాటికి, విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు చేసుకునే నాటికి ఛత్తీస్‌గఢ్‌లో సంబంధిత పవర్‌ప్లాంట్లు లేవని, భద్రాద్రి ప్రాజెక్ట్‌లో సబ్‌క్రిటికల్ సాంకేతికతను వినియోగించడం వల్ల రూ.250 కోట్ల నుంచి రూ. 300 కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన విలేకరులకు చెప్పారు. నేను సమాధానం ఇచ్చేలోపే ఇలా ప్రకటించడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం. జస్టిస్ నరసింహారెడ్డి నిష్పాక్షికంగా వ్యవహరించడంలేదు. ముందే ఒక నిర్ణయానికి వచ్చి నేను (కేసీఆర్) తప్పు చేసినట్లుగా విలేకరుల సమావేశంలో మాట్లాడడాన్ని బట్టి.. ఈ విచారణ

నామమాత్రమేనని భావించాల్సి వస్తోంది.

# 'జగిత్యాల జగడం'.. జీవన్ రెడ్డికి కేసీ వేణుగోపాల్ బంపరాఫర్?



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో 'జగిత్యాల జగడం' హాట్ టాపిక్‌గా మారింది. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడంతో స్థానిక ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హస్తం పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో జీవన్ రెడ్డితో కాంగ్రెస్ హైకమాండ్ చర్చలు జరుపుతోంది. ఈ సందర్భంగా జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఆఫర్ చేసినట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాగా, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు జీవన్ రెడ్డి సిద్ధమవడంతో ఆయనతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఏకాంతంగా చర్చలు జరుపుతున్నారు. పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో ఫోన్‌తో మాట్లాడించారు. కాగా, వేణుగోపాల్‌తో జీవన్ రెడ్డి మాట్లాడిన తర్వాత రాజీనామాపై వెనక్కి తగ్గినట్టు తెలుస్తోంది. ఈ సంధ్భంగా కేసీ వేణుగోపాల్.. జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఆఫర్ చేసినట్టు సమాచారం. అనంతరం, జీవన్ రెడ్డి మాట్లాడుతూ..'శాసనమండలి ఛైర్మన్ అందుబాటులో లేరు. ఆయన అందుబాటులోకి రాగానే నా నిర్ణయం చెబుతాను. తొందరలోనే మండలి ఛైర్మన్ దగ్గరికి వస్తాను. రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ నాతో మాట్లాడారు. సీనియర్ నాయకులు, సభ్యులు నా దగ్గరికి వచ్చారు. నేను కాంగ్రెస్‌లోనే ఉంటాను. పార్టీతో నాకు 40 సంవత్సరాల అనుబంధం ఉంది. జరిగిన పరిస్థితులు నాకు బాధ కలిగించాయి. మండలి ఛైర్మన్‌ను సమయం అడిగాను అంటేనే మీరు ఆలోచించండి' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా.. మంగళవారం ఉదయం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గంలోని తన మద్దతుదారులంతా గాంధీభవన్‌కు రావాలని పిలుపునిచ్చారు. తనకు మద్దతుగా నిలవాలన్నారు. దీంతో, కాంగ్రెస్ పార్టీలో హైడ్రామా క్రియేట్ అయ్యింది. నిన్న(సోమవారం) కూడా జగిత్యాలలో జీవన్ రెడ్డి ఇంటి వద్దకు భారీ సంఖ్యలో కార్యకర్తలు రావడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

# నీట్‌అక్రమాలపై సిబిఐ దూకుడు

**పలువురిపై కేసులు నమోదు అక్రమాలను ఆరా తీస్తున్న అధికారులు**




**న్యూఢిల్లీ:**నీట్ అక్రమాలపై దర్యాప్తు బాధ్యతలను స్వీకరించిన సీబీఐ జోరు పెంచింది. బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లో నీట్ అవకతవకలకు సంబంధించి నమోదైన ఒక్కో కేసును రీ రిజిస్టర్ చేసింది. రాజస్థాన్‌లో మూడు కేసుల దర్యాప్తును స్వీకరించింది. మహారాష్ట్రలోని లాతూరులో యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) నమోదు చేసిన మరో కేసును కూడా సీబీఐ స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. కాగా.. నీట్ అక్రమాలపై బిహార్, గుజరాత్‌లో నమోదైన కేసుల దర్యాప్తునకు ఆదివారానికే పట్నా, గోధ్రాకు చేరుకున్న సీబీఐ ప్రత్యేక బృందాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి. పట్నాకు చేరుకున్న సీబీఐ బృందం.. కొద్దిరోజులుగా అక్కడ పేపర్ లీక్ కేసును అత్యంత సమర్థంగా దర్యాప్తు చేస్తున్న ఆర్థిక నేరాల విభాగం కార్యాలయానికి సోమవారం ఉదయం వెళ్లి కీలక వివరాలు సేకరించింది. ముమ్మర దర్యాప్తు చేసి ఇప్పటికే 18 మందిని అరెస్టు చేసిన ఈవోయు.. వారి మొబైల్ ఫోన్లను, సిమ్‌కార్డులను, ల్యాప్‌టాప్‌లను, పోస్ట్‌డేటెడ్ చెక్కులను, కాల్చేసిన నీట్ ప్రశ్నపత్రం అవశేషాలను స్వాధీనం చేసుకుంది. నీట్ అక్రమాలపై దర్యాప్తు బాధ్యతను సీబీఐకి బదిలీ చేస్తూ బిహార్ సర్కారు ఆదివారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో.. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులందరినీ విచారణ నిమిత్తం సీబీఐ బృందం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీకి తీసుకెళ్లే అవకాశం ఉందని ఈవోయు అధికారి ఒకరు తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడైన దానాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ జూనియర్ ఇంజనీర్ సికందర్ ప్రసాద్ యాదవేందుపై ఆదాయానికి మించి ఆస్తుల కేసు కూడా సీబీఐ నమోదు చేసే అవకాశం ఉందని వెల్లడించారు. యాదవేందును ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించినట్టు ఆ అధికారి వెల్లడించారు. అతడికి క్రిమినల్ కార్యకలాపాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. 2012లో జూనియర్ ఇంజనీర్ కాక ముందు అతడు రాంచీలో కాంట్రాక్టర్‌గా పనిచేసేవాడు. గతంలో జరిగిన రూ.3 కోట్ల విలువైన ఎల్ఈడీ స్కామ్‌లో అతడికి జైలు శిక్ష పడింది' అని ఆ అధికారి వివరించారు. మరోవైపు.. గోధ్రాకు చేరుకున్న సీబీఐ బృందం స్థానిక పోలీసు అధికారులను కలిసి, నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి వివరాలు సేకరించినట్టు పంచమహల్ జిల్లా ఎస్పీ హిమాన్షు సోలంకి తెలిపారు. సీబీఐ దర్యాప్తునకు తాము అన్ని విధాలుగా సహకరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో గుజరాత్ పోలీసులు ఇప్పటిదాకా ఐదుగురిని అరెస్ట్ చేశారు. అక్కడి ఒక కేంద్రంలో పరీక్ష రాసే 27 మంది అభ్యర్థులతో వారు ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం.. వారు ప్రశ్నపత్రంలో తమకు తెలిసిన సమాధానాలు రాసి మిగతావాటిని వదిలిపెడితే, వాటికి వీరు సమాధానాలు రాస్తారు. ఇందుకోసం ఒక్కొక్క అభ్యర్థి నుంచి రూ.10 లక్షలు తీసుకున్నారు. ఈ మేరకు వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వారు సహకరించినప్పటికీ.. ఆ 27 మందిలో ముగ్గురు మాత్రమే నీట్‌ను క్లియర్ చేసినట్టు సమాచారం. ఇక.. మహారాష్ట్రలోనూ నీట్ అక్రమాలకు పాల్పడ్డ ఆరోపణలపై నాందేడ్ యాంటీ టెర్రరిజమ్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు లాతూర్‌కు చెందిన జలీల్ ఖాన్ ఉమర్ ఖాన్ పఠాన్ అనే జిల్లా పరిషత్ స్కూల్ టీచర్‌ను అరెస్ట్ చేశారు. అతడితో పాటు లాతూరుకే చెందిన సంజయ్ తుకారామ్ జాధవ్ అనే టీచర్‌పైన, నాందేడ్‌కు చెందిన ఇరాన్నా మషన్జీ కొంగల్వావ్, ఢిల్లీకి చెందిన గంగాధర్ అనే ఇద్దరు వ్యక్తులపైన కేసు నమోదు చేశారు. జలీల్‌ఖాన్‌ను అరెస్ట్ చేసిన ఏటీఎస్ అధికారులు.. పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం గాలిస్తున్నారు. కాగా.. నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారించిన రాజస్థాన్ హైకోర్టు.. ఆ పిటిషన్లపై స్పందన తెలపాలంటూ జాతీయ టెస్టింగ్ ఏజెన్సీకి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. నియమించేందుకు ఇంటర్వ్యూలు చేస్తున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆరోపించారు.

# ఎన్‌డిఎకు షాక్ ఇచ్చిన ఇండియా కూటమి

**స్పీకర్ పదవికి పోటీని పెట్టిన కాంగ్రెస్**

**ఓంబిర్లాకు పోటీగా కొడికున్నల్ సురేశ్ నామినేషన్**

**నేడు స్పీకర్ ఎన్నికకు ఓటింగ్**

**న్యూఢిల్లీ:** దేశ చరిత్రలో తొలిసారి స్పీకర్ ఎన్నికకు పోటీ జరుగుతోంది. అధికార ఎన్‌డిఎ ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి సై అంటోంది. లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్డీయే అభ్యర్థిగా ఓం బిర్లా ఏకగ్రీవం అవుతారని భావించిన బీజేపీ, ఎన్డీయే కూటమికి విపక్ష కాంగ్రెస్ భారీ షాక్ ఇచ్చింది. సంఖ్యా బలం తక్కువున్నా.. కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలిపింది. ఈ మేరకు కేరళ నుంచి 8సార్లు ఎంపీగా గెలుపొందిన కొడికున్నిల్ సురేష్‌ను ఇండియా కూటమి నుంచి స్పీకర్ అభ్యర్థిగా ప్రకటిస్తూ కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయన మంగళవారం తన నామినేషన్ దాఖలు చేశారు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి అప్పగించాలన్న సంప్రదాయాన్ని బీజేపీ తుంగలో తొక్కుతోందని రాహుల్ ఆరోపించారు. ఇకపోతే సీనియార్టీ ప్రకారం సురేశ్ ప్రోటెం స్పీకర్ కావాల్సి ఉన్నా, అధికార ఎన్‌డిఎ కూటమి ఒడిషాకు చెందిన మరో సీనియర్ భర్తృహరిని ఎంపిక చేసింది. ఈ నిర్ణయంపై ఇండియా కూటమి ఆగ్రహంతో ఉంది. ఈ క్రమంలో కనీసం డప్యూటి స్పీకర్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ కోరుతోంది. డిప్యూటి పదవిని తమకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే సయోధ్య కుదరకపోవడంతో దేశ చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. ఇప్పటికి వరకు జరిగిన లోక్‌సభ స్పీకర్ పదవులన్నీ ఏకగ్రీవం అయ్యాయి. కాగా 75 ఏళ్ళ దేశ చరిత్రలో లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగడం ఇదే తొలిసారి కానుంది. తొలుత స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం అవుతుందని భావించారు. కానీ స్పీకర్ ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ మెలిక పెట్టింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇండియా కూటమి సభ్యులతో జరిపిన చర్చల్లో.. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు ఇస్తే స్పీకర్‌కి మద్దతు తెలుపుతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దీంతో డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చేందుకు ఎన్డీయే కూటమి దాదాపు అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, కాంగ్రెస్ అనూహ్యంగా అభ్యర్థిని పోటీలో నిలిపింది. దీంతో స్పీకర్ పదవికి తొలిసారి పోటీ జరుగబోతున్నది. తొలిసారి ప్రతపక్ష అభ్యర్థిగా కొండికునాల్ సురేశ్ పోటీపడుతున్నారు. కాగా ఎన్ డిఎ అభ్యర్థిగా ఓమ్ బిర్లా పోటీపడుతున్నారు. నామినేషన్ల ప్రక్రియ మధ్యాహ్నం 12.00 గంటలకు ముగిసింది. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ తో మోడీ నేతృత్వంలోని ఎన్ డిఎ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ విషయంలో ఓ అంగీకారానికి రాలేకపోయింది. దాంతో స్పీకర్ పదవికి పోటీ నెలకొంది. 18వ లోక్ సభ తొలి రోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ సహా 262 మంది కొత్తగా ఎన్నికయిన ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. కాగా మిగతా 281 మంది కొత్త ఎంపీలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేసారు. వారిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ ఉన్నారు. స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగనున్నది. ఇదిలావుండగా ఇండియా బ్లాక్ కు చెందిన ఎంపీలు పార్లమెంటు లోపల, వెలుపల 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్న నినాదాలతో, రాజ్యాంగం ప్రతులను పట్టుకుని నిరసన తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 27 న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే ప్రక్రియ కొనసాగనున్నది. వచ్చే వారం ఉభయ సభలలో ప్రధాని మోడీ చర్చలపై సమాధానాలు ఇవ్వనున్నారు.



# బాలికను గంజాయి మత్తులో దింపి అత్యాచారం

హైదరాబాద్,: నిర్భయ లాంటి చట్టాలు ఎన్ని తెచ్చినా మృగాళ్ల తీరు మారడం లేదు. తాజాగా, హైదరాబాద్‌లో దారుణం జరిగింది. మత్తుకు బానిసైన యువకులు ఆ మత్తులోనే దారుణాలకు ఒడిగడుతున్నారు. ఓ బాలికకు గంజాయి అలవాటు చేసిన యువకులు ఆమె మత్తులోకి దిగగానే దారుణానికి ఒడిగట్టారు. ఈ అమానుష ఘటన హైదరాబాద్ నేరేడుమెట్‌లో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలికపై ఐదుగురు యువకులు అత్యాచారానికి ఒడిగట్టిన దారుణ ఘటన నేరెడుమెట్ పరిధిలో తాజాగా వెలుగుచూసింది. కాచిగూడలో ఉంటున్న ఓ బాలికను ఐదుగురు యువకులు ట్రాప్ చేసి నేరెడుమెట్ తీసుకెళ్లారు. అక్కడ బాలికకు గంజాయి అలవాటు చేసి ఆమె మత్తులోకి వెళ్లగానే ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారం చేశారు. బాలిక ఈ ఘోరాన్ని తల్లికి చెప్పకుండా దాచింది. ఆమెలో వస్తున్న మార్పులు గమనించిన తల్లి గట్టిగా నిలదీయగా.. జరిగిన దారుణాన్ని తల్లికి చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి పోలీసులను ఆశ్రయించింది. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు.. కేసును నేరెడ్‌మెట్‌కు బదిలీ చేశారు. దీనిపై విచారించిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# రైతుల అభివృద్ధికి కృషి చేయాలి.


**నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం.**

**నూతన పాలకవర్గ సభ్యులకు అభినందన.**

**వేగుచుక్క న్యూస్,నకిరేకల్ నియోజకవర్గం, జూన్ 25:**



పాల ఉత్పత్తిదారుల సంఘాల పాలకవర్గాలు రైతుల అభివృద్ధికి కృషి చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల మదర్ డైరీ పాల ఉత్పత్తి దారుల సహకార సంఘం నూతన పాలక వర్గాన్ని మంగళవారం ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఛైర్మన్ గా ఎన్నికైన వరకంతం నరేందర్ రెడ్డి, డైరెక్టర్ లు జిట్టా రవి, చిర్రబోయిన యాదయ్య, రేముడల ఆనంద్, యాసా దేవందరమ్మ, సూదిరెడ్డి లక్ష్మారెడ్డి, జిట్టా యాదయ్య, చిర్రబోయిన రమేష్, పెద్దగోని ముత్యాలు, మాంద్ర గణేష్ తదితరులు ఉన్నారు.




# ఢిల్లీలో వెంకయ్యతో ప్రధాని మోడీ భేటీ

## ఇరువురి మధ్య జాతీయ ప్రయోజనాలపై చర్చ



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడుతో సమావేశమయ్యారు. మంగళవారం ఢిల్లీలోని త్యాగరాజ్ మార్గ్‌లోని వెంకయ్య నాయుడు నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ జాతీయ ప్రయోజనాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. వీరిద్దరి భేటీపై మోడీ ట్వీట్ చేశారు. తాను వెంకయ్య నాయుడును కలిశానని, ఆయనతో దశాబ్దాలుగా పని చేసే అవకాశం లభించిందని వ్యాఖ్యానించారు. భారతదేశ పురోగతి పట్ల ఆయన వివేకం, అభిరుచిని ఎప్పుడూ ప్రశంసించానని అన్నారు. అలాగే మోడీ తన నివాసానికి వచ్చి కలిశారని, భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన మోడీకి ఈ సందర్భంగా నా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాని వెంకయ్యనాయుడు ట్వీట్ చేశారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఈ సందర్భంగా మా అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నాము. నరేంద్ర మోడీ నాయకత్వంలో రాబోయే సంవత్సరాలలో భారత్ మరింత ప్రకాశిస్తుందని, సరి కొత్త శిఖరాలకు చేరుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

# అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి.

## - డిఇఓ కు పిడిఎస్ యూ వినతి

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 25:**



నిజామబాద్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేటు కార్పోరేట్ పాఠశాలల ఫీజుల దోపిడిని అరికట్టాలని పిడిఎస్ యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డిఇఓ దుర్గ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియమించకుండా విద్యార్థుల సంఖ్య ఎలా పెరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలకు అనుమతులు లేకుండా, సౌకర్యాలు లేకుండా, క్వాలిఫికేషన్ లేని టీచర్ల విద్యాబోధన చెప్తున్నా జిల్లా అధికారులు నిమ్మకునీరెత్తి నట్లు ఉండడం సిగ్గుచేటన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాలమ్ముతున్న, ఇష్టం వచ్చిన రీతులుగా ఫీజులు వసూలు చేస్తున్నా, జిల్లా అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో పేరెంట్స్ కమిటీలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులను డిస్ప్లే చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. అనుమతులు లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల పేర్లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఇకనైనా జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న ప్రతీ సమస్యను పరిష్కరించి ప్రైవేటు కార్పోరేట్ దోపిడి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో కిడ్స్ పాఠశాలలు, ప్లే పాఠశాలలు విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయని వాటిపై చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థి ఉద్రమాలు ఉధృతం అవుతాయని, జరిగే పరిణామాలకు జిల్లా విద్యాధికారులు, ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే. అషూర్, జిల్లా సహాయ కార్యదర్శి బి. చందు, జిల్లా కోశాధికారి నిఖిల్, జిల్లా నాయకులు మహిపాల్, మమత, జంపన్న తదితరులు పాల్గొన్నారు.




# బొల్లి వ్యాధి" పై అవగాహన పెంచుకోవాలి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 25:**

**జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ , డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్. బొల్లివ్యాధి దినోత్సవం సందర్భంగా జిజిహెచ్ లో అవగాహన సదస్సు**




"బొల్లి వ్యాధి" పై ప్రజలు అవగాహన పెంచుకోవాలనీ జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ , డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్ పేర్కొన్నారు. బొల్లివ్యాధి దినోత్సవం సందర్భంగా జిజిహెచ్ లో మంగళవారం డెర్మటాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమరాజ్ , డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ, బొల్లి అనే చర్మవ్యాధి ప్రపంచవ్యాప్తంగా 1-2 శాతం ఉన్నదని, ఈ రుగ్మత ఒకరి నుంచి ఒకరికి సంక్రమించే అంటూవ్యాధి కాదని, బొల్లి రావడానికి అనేక కారణాలు ఉంటాయని అన్నారు. సరియైన సమయంలో ఈ వ్యాధిని గుర్తించి సరియైనచికిత్సను అందిస్తే నివారణ చాలా సులభం అని తెలిపారు. ప్రజలు బొల్లిపైన సరియైన అవగాహన పెంచుకొని మీ పరిసర ప్రాంతాలలో ఇతరులకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ ఆసుపత్రిలో 2వ అంతస్తు లో డేర్మటాలజీ విభాగంలో దీనికి చికిత్సను అందిస్తున్నారని అన్నారు. సరైన మందులను వాడి బొల్లిని తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇందిరాక్షి, డాక్టర్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టం" తీసుకురావాలి.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 25:**




**ప్రభుత్వ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి.**
**ప్రైవేట్ జూనియర్ కాలేజీలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి.**
**పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్.**

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలని, ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టడానికి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పిడిఎస్ యూ ఆధ్వర్యంలో డిఐఈఓ కార్యాలయం ముందు నిరసన తెలిపి, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయని అన్నారు. తరగతులు సరిగ్గా జరగడంలేదని, త్రాగునీరు, టాయిలెట్ల సమస్య పరిష్కరించాలని, లెక్చరర్ల కొరత లేకుండా చూడాలని, ఉత్తీర్ణత పెంపొందించే విధంగా ఇప్పటినుంచి చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఫీజుల దోపిడీ విపరీతంగా పెరిగిందని, జేఈఈ, మెయిన్స్, నీట్ , పేరుతో రెండు లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా దోపిడీ నిజామాబాద్ జిల్లాలో విపరీతంగా జరుగుతుందని, వివిధ రకరకాల పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఈ ఫీజులను అరికట్టడానికి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నాయకులు మనోజు, నిఖిల్, రవీందర్, హనుమాన్లు, దుర్గ ప్రసాద్,తేజ , తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లైయాష్ తరలింపులో అక్రమాలు

**దేవుడి ముందు పొన్నం ప్రమాణం చేయాల్సిందే ఇంట్లోనే ప్రమాణం చేసి సవాల్ చేసిన పాడి కౌశిక్ రెడ్డి**

**కరీంనగర్:** మంత్రి పొన్నం ప్రభాకర్ అవినీతికి పాల్పడ్డాడంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాలు విసిరారు. ముందుగా తాను ఎలాంటి అవినీతి చేయలేదని పేర్కొంటూ తడి బట్టలతో దేవుడి ఫోటో ముందు పాడి కౌశిక్ రెడ్డి ప్రమాణం చేశారు. తాను ఎక్కడా ఒక్క అవినీతి చేయలేదని.. చేసే అవసరం కూడా తనకు లేదని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాలు విసిరారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అపోలో వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వచ్చి తన నిజాయతీని నిరూపించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కౌశిక్ రెడ్డి సవాలు విసిరారు. ఫ్లైయాష్ తరలింపు, ఓవర్‌లోడ్ లారీల నుంచి డబ్బులు తీసుకోలేదని దేవుడి మీద ప్రమాణం చేయాలన్నారు. ఒకవేళ నువ్వు రాకపోతే అన్ని స్కామ్‌లు చేసినట్లు, అక్రమంగా వేల కోట్ల రూపాయలు దోచుకున్నానని ఒప్పుకున్నట్లేనని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఇటీవల కాంగ్రెస్ నేత ప్రణవ్‌బాబు స్పందించారు. కౌశిక్ రెడ్డి ఎలాంటి అవినీతి చేయకపోతే చెల్పూరు హనుమాన్ టెంపుల్‌కు వచ్చి ప్రమాణం చేయాలని సవాలు విసిరారు. ఈ సవాలును స్వీకరించిన కౌశిక్ రెడ్డి ఇవాళ చిల్పూరు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కౌశిక్ రెడ్డిని వీణవంకలోనే హౌస్ అరెస్టు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంది. ఈ క్రమంలో వీణవంకలోని తన ఇంట్లోనే కౌశిక్ రెడ్డి ప్రమాణం చేసి తన నిజాయతీని రుజువు చేసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఇటీవల కంగ్రెస్ నేత ప్రణవ్ కౌంటర్ ఇచ్చారు. చెల్పూరు హనుమాన్ టెంపుల్ దగ్గరకు రావాలని సవాలు విసిరారు. ఈ సవాలును పాడి కౌశిక్ రెడ్డి స్వీకరించారు.

# విధ్యార్థి సంఘాలకు పోలీస్ కమీషనర్ హెచ్చరిక.



**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 25:**

**విద్యా సంస్థల్లో గొడవలకు దిగితే సహించం మని వెల్లడి.**
**సమస్యలుంటే అధికారుల దృష్టికి తేవాలని హితవు.**

విద్యార్థి సంఘాలు సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అందుకు భిన్నంగా ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల్లోకి వెళ్లి గొడవలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ హెచ్చరించారు. మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పోలీస్ కమిషనర్ పలు అంశాలు వెల్లడించారు. జిల్లాలోని కొన్ని విద్యార్థి సంఘాలు ఈ మధ్య కాలంలో కొన్ని ప్రైవేట్ స్కూల్స్ కు, ప్రైవేట్ కళాశాలల క్యాంపస్ లోకి ప్రవేశించి యాజమాన్యాలతో గొడువకు దిగి , భయభ్రాంతులకు గురి చేస్తు వారి విధులను అడ్డుకుంటున్నట్టు మా దృష్టికిరావడం జరిగిందన్నారు. అందువల్ల విధ్యార్థి నాయకులకు లేదా విధ్యార్థి సంఘాలకు విధ్యకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న వారు ముందుస్తుగా జిల్లా విధ్యాశాఖ అధికారుల దృష్టికి, జిల్లా పరిపాలన అధికారి దృష్టికి తీసుకొని వెళ్లాలని, సమస్య పరిష్కారానికి సామరస్యంగా కృషిచేయాలని సూచించారు. అందుకు విరుద్ధంగా స్కూళ్లకు లేదా కాలేజీలకు వెళ్లి దాడులు నిర్వహించిన, బంద్ చేయించిన, యాజమాన్యాలను బయభ్రాంతులకు గురిచేసిన వారి పై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ జిల్లాలోని అన్ని డివిజన్ స్థాయి అధికారులకు, సర్కిల్ ఇన్ స్పెక్టర్ల కు, ఎస్.హెచ్.ఓలకు, ఎస్.ఐలకు ఆదేశాలు జారీచేయడం జరిగింది.

# రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ



**హైదరాబాద్:** తెలంగాణలో ఈ వానాకాలం సీజన్ నుంచి ప్రారంభించనున్న రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను సేకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం రాష్ట్రంలో 110 నియోజకవర్గాల్లోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా అధికారులు అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఆ నియోజకవర్గాల్లోని క్లస్టర్ల నుంచి రైతులను రైతువేదికలకు ఆహ్వానించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. చాలామంది రైతులు సన్న,చిన్నకారు రైతులకే రైతుబంధు అమలు చేయాలని, బడా రైతులకు చేయడం వల్ల తమకు నష్టం జరుగుతుందని తెలిపినట్లు సమాచారం. క్లస్టర్ల వారీగా సేకరించిన సమచారాన్ని నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న రైతుబంధు పథకం స్థానంలో 'రైతుభరోసా'ను అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'రైతుబంధు' నిబంధనలను మార్చి కొత్త మార్గదర్శకాలతో 'భరోసా'ను అమలుపరిచేందుకు కసరత్తు చేస్తోంది. రైతులు, వివిధ వర్గాలవారి అభిప్రాయాలను తెలుసుకొని వాటికి అనుగుణంగా రైతుభరోసాపై నిర్ణయం తీసుకోవాలని ఇటీవలి మంత్రిమండలి సమావేశం తీర్మానించింది. అర్హులకు మాత్రమే ప్రజాధనం అందాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం రైతుభరోసా విధివిధానాలను ఖరారు చేయనుందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, సూచనలను మంత్రివర్గ ఉపసంఘానికి అందజేస్తామని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి ఈ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని, అర్హులైన పేదలకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రుణమాఫీ, రైతుభరోసా అమలుపై భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతున్నారని, వీటిని పారదర్శకంగా, ఆదర్శంగా అమలుచేయాలన్న ఉద్దేశంతోనే ఆలస్యమవుతుందన్న విషయాన్ని గుర్తించాలని భారాస శ్రేణులకు హితవు పలికారు.

# కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పాటించలేదు

రాహుల్ డిప్యూటి ప్రతిపాదనలపై చర్చ

**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఓం బిర్లా ఏకగ్రీవంగా ఎన్నికవుతారని అంతా భావించారు. కానీ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తమ స్పీకర్ అభ్యర్థిగా కె.సురేశ్‌ను బరిలో దింపింది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఆ పదవికి రేపు ఎన్నిక జరగనుంది. అయితే లోక్‌సభ స్పీకర్ పదవి మీరు తీసుకోండి.. డిప్యూటీ స్పీకర్ పదవి మాత్రం ప్రతిపక్షానికి కేటాయించి పాత సంప్రదాయాన్ని కొనసాగించడంటూ బీజేపీ పెద్దల ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపాదన చేశారు. రాహుల్ చెబుతున్న ఈ పాత సంప్రదాయంపై రాజకీయ వర్గాల్లో ఓ ఆసక్తికర చర్చ అయితే వాడి వేడిగా నడుస్తుంది. దీనిపై కొందరు అధికార పార్టీ ఎంపిలు తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ పాలిత లేదా ఇండియా కూటమి పాలిత రాష్ట్రాల్లో ఈ సంప్రదాయం ఎందుకు కొనసాగించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే బీజేపీ పెద్దల ముందు రాహుల్ గాంధీ పెట్టిన ఈ 'సంప్రదాయం' ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రంలో కానరావడం లేదనే ఓ చర్చ వైరలవుతుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, కేరళ అసెంబ్లీలలో అధికార పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలే స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లుగా కొనసాగుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాలు తెలంగాణ, ఝార్ఖండ్‌లలో స్పీకర్‌గా ఆ పార్టీ వారే ఎన్నికయ్యారు. మరోవైపు ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్లు లేక పోవడం గమనార్హం. అలాగే పంజాబ్, ఢిల్లీలలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం కొలువు తీరింది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీలలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు ఇద్దరు అధికార పార్టీకి చెందిన వారేనన్న విషయం అందరికీ తెలిసిందే. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో సైతం స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు ఇద్దరు హస్తం పార్టీకి చెందిన వారే కొనసాగుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెబుతున్న పాత సంప్రదాయం 'ఇండియా కూటమి' ఎలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడా లేదనే ఓ చర్చ సైతం హాట్ హాట్‌గా కొనసాగుతుంది.




# కల్కిలో చేరడానికి ఏడాది ఆలోచించా: కమల్




ఎన్నో రోజులుగా ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఎదురుచూస్తోన్న 'కల్కి'మరికొన్ని గంటల్లో అంటే ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక ఇందులో ఎంతో శక్తిమంతమైన అశ్వత్థామ పాత్రను బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ పోషించారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ ప్రాజెక్ట్ మొదలైన దగ్గరనుంచి అమితాబ్ వరుస అప్‌డేట్‌లతో అభిమానుల్లో జోష్ పెంచుతూనే ఉన్నారు. తాజాగా ఆయన మరో ఆసక్తికర పోస్ట్ పెట్టారు. అలాగే కమల్‌హాసన్ కూడా ఈ సినిమాను అంగీకరించ డానికి ఏడాది ఆలోచించినట్లు తెలిపారు. 'కల్కి'లో అగ్ర కథానాయకుడు కమల్ హాసన్ విలన్‌గా కనిపించనున్నారు. సుప్రీం యాస్కిన్ పాత్రను ఆయన పోషించారు. తాజాగా ఆయన ఈ సినిమా గురించి మాట్లాడుతూ.. తన పాత్రను అంగీకరించడానికి ఏడాది సమయం తీసుకున్నట్లు తెలిపారు. 'ఈ పాత్ర గురించి చెప్పగానే నాకు స్వీయసందేహం వచ్చింది. నేను దీన్ని చేయగలనా అనిపించింది. గతంలో చాలా సినిమాల్లో విలన్‌గా నటించాను. కానీ, ఇది వాటికి మించినది. భిన్నమైన పాత్ర. అందుకే దీనికి సంతకం చేయడానికి ఏడాది ఆలోచించా' అని చెప్పారు. అమితాబ్ బచ్చన్ తాజాగా తన బ్లాగ్‌లో ఓ పోస్ట్ చేశారు. 'కల్కి రిలీజ్‌కు ముందు రామచరితమానస్ చదవడం ఆనందంగా ఉంది. ఎన్ని యుగాలు గడిచినా కొన్ని శాశ్వతంగా ఉంటాయి. శాశ్వతమైన శాంతి, ప్రశాంతత కోసం నేను ప్రార్థిస్తున్నాను. దీన్ని ఎప్పుడైనా.. ఎవరైనా చదవొచ్చు' అని రాసుకొచ్చారు. అందులోని పద్యాలకు అర్థాలను వివరించారు. ఇక తాజాగా ఈ సినిమా టీమ్ ఇచ్చిన ఇంటర్వ్యూలో దర్శకుడు నాగ్ అశ్విన్‌పై అమితాబ్ ప్రశంసలు కురిపించిన సంగతి తెలిసిందే. 'కల్కి'లో విజువల్స్ నమ్మశక్యం కావు. అన్నింటినీ తెరపై అద్భుతంగా చూపించారు. ఇంతగొప్ప ప్రాజెక్ట్‌లో భాగమవడం నాకు ఎప్పటికీ మర్చిపోలేని ఓ అనుభవం. నాగ్‌అశ్విన్ ఈ కథ చెప్పి వెళ్లిన తర్వాత 'ఇతను ఏం తింటున్నాడు.



# ప్రేక్షకులను పలకరించనున్న దీపిక

కల్కి 2898 ఏడీ'తో తెలుగు ప్రేక్షకులను నేరుగా పలకరించబోతున్నారు నటి దీపికా పదుకొణె. కొన్నాళ్ల క్రితమే ఆమె టాలీవుడ్‌లో నటించారుగానీ ఆ సినిమా విడుదలకు నోచుకోలేదు. మోడల్‌గా రాణించే సమయంలోనే ప్రముఖ కంపెనీల యాడ్స్‌లో నటించడంతోపాటు పలు 'ఫ్యాషన్ వీక్స్'లో పాల్గొనేవారు. బికినీ ధరించి, కింగ్ ఫిషర్ క్యాలండర్‌కు పోజులివ్వడం అప్పట్లో హాట్ టాపిక్. సంగీత దర్శకుడు హిమేశ్ రేష్మియాతో కలిసి నటించిన 'నామ్ హై తేరా' మ్యూజిక్ వీడియో శ్రోతల్ని విశేషంగా అలరించింది. ఉపేంద్ర హీరోగా తెరకెక్కిన కన్నడ చిత్రం 'ఐశ్వర్య' (2006)తో హీరోయిన్‌గా తెరంగేట్రం చేశారు. అది తెలుగు హిట్ మూవీ 'మన్మథుడు'కు రీమేక్‌గా రూపొందింది. ఇక్కడ సోనాలీ బింద్రే పోషించిన పాత్రలో అక్కడ దీపిక నటించారు.దీపిక తొలి బాలీవుడ్ సినిమా 'ఓం శాంతి ఓం' ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. షారుక్ ఖాన్–దీపికలను 'సూపర్ హిట్ జోడీ' అని పిలవడం ఆ చిత్రంతోనే ఆరంభమైంది. చిత్ర పరిశ్రమ ఇతివృత్తంగా తెరకెక్కిన ఈ మూవీలో ఈ ఇద్దరూ ద్విపాత్రాభినయం చేశారు. 'హీరోయిన్' పాత్రలో ఒదిగిపోయేందుకు దీపిక పడిన శ్రమ వృథా పోలేదు. ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. ఆ తర్వాత, ఇదే కాంబినేషన్‌లో వచ్చిన 'చెన్నై ఎక్స్‌ప్రెస్', 'హ్యాపీ న్యూ ఇయర్', 'పఠాన్' సైతం మంచి విజయాల్ని అందుకున్నాయి. 'బాజీరావు మస్తానీ', 'పద్మావత్' వంటి హిస్టారికల్ మూవీస్ ఆమెను బాలీవుడ్‌లో ప్రత్యేకంగా నిలిపాయి. యాసిడ్ దాడి బాధితురాలిగా నటించిన 'ఛపాక్' విమర్శకుల ప్రశంసలు అందుకుంది. షారుక్, అమితాబ్ బచ్చన్, అక్షయ్ కుమార్ ఇలా అగ్ర నటుల సరసన నటించినా.. కథ నచ్చితే యంగ్ హీరోలతో ఆడిపాడేందుకూ ముందుంటానని 'చెప్పకనే చెప్పారు. 'ధమ్ మారో ధమ్', 'బాంబే టాకీస్'లాంటి సినిమాల్లోని ప్రత్యేక గీతాలతోనూ ఉర్రూతలూగించారు. ఆంగ్ల చిత్రాలు '÷రైడింగ్ ఫానీ', 'ట్రిబుల్ ఎక్స్: ది రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్'లతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఇన్నేళ్ల తర్వాత 'కల్కి'తో అలరించేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన ఈ సైన్స్ ఫిక్షన్ మూవీతో అలరించ బోతున్నారు.




# కల్కి విడుదల రోజు రికార్డు


## అపర్ణ మల్టీప్లెక్స్‌లో ఏకంగా 42 షోలు

గ్లోబల్ స్టార్ ప్రభాస్ నటిస్తోన్న తాజా మూవీ కల్కి 2898 ఏడీ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వస్తోన్న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా 27న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది చిత్రబృందం. ఇప్పటికే ఏపీ, తెలంగాణతోపాటు దేశవ్యాప్తంగా బుకింగ్స్ షురూ అయ్యాయి. హైదరాబాద్‌లో చాలా వరకు మల్టీప్లెక్స్ ఎక్కువ మొత్తంలో షోలు రన్ చేయబోతున్నాయి. కొత్తగా ఓపెన్ చేసిన అపర్ణ సినిమాస్ మల్టీప్లెక్స్ ఓపెనింగ్ డేనే 42 షోలు ఏర్పాటు చేసింది. ఈ అన్ని షోలకు టికెట్లు అమ్ముడుపోవడంతో అరుదైన రికార్డు నమోదు చేసింది. ఇక రానున్న రోజుల్లో ఎలాంటి ఈ చిత్రం ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. కల్కి 2898 ఏడీ మిడ్ వీక్‌లో విడుదలవుతున్నప్పటికీ బుకింగ్స్ షురూ చేసిన కొన్ని గంటలకే నేషనల్ బెల్ట్‌లో హిందీ వెర్షన్ టిక్కెట్స్ సుమారు 13 వేలకుపైగా అమ్ముడయ్యాయని ఇప్పటికే స్టన్నింగ్ వార్త బయటకు వచ్చింది. ఇక కల్కి 2898 ఏడీ అడ్వాన్స్ సేల్స్ ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే రూ.50 కోట్లు దాటి టాక్ ఆఫ్ ది గ్లోబల్ ఇండస్ట్రీగ్రా నిలిచింది. సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో వస్తోన్న ఈ ప్రాజెక్ట్‌ను వైజయంతీ మూవీస్ తెరకెక్కిస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా? బెంగాలీ నటుడు శాశ్వత ఛటర్జీ విలన్‌గా నటిస్తున్నాడు. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న శ్రీలీల



ప్రముఖ నటి శ్రీలీల తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. శ్రీలీలకు స్వాగతం పలికిన టీటీడీ అధికారులు.. దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు అమెకు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఏదైనా మొదలుపెట్టేటప్పుడు స్వామివారిని దర్శించుకోవడం తనకు అలవాటని తెలిపారు. త్వరలో రాబిన్ హుడ్ చిత్రంలో నటిస్తున్నట్లు చెప్పారు. కాగా, తెలుగులో వరుస సీనిమాలతో బిజీగా ఉన్న శ్రీలీల.. త్వరలో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టున్నారు. వరుణ్ ధావన్ హీరోగా రూపొందుతున్న చిత్రంలో హీరోయిన్‌గా శ్రీలీల కనిపించనున్నట్లు తెలుస్తున్నది. అది ట్రయాంగిల్ లవ్‌స్టోరీగా టాక్. ఇందులో శ్రీలీలతోపాటు మృణాల్ ఠాకూర్ మరో హీరోయిన్‌గా నటిస్తారని వార్తలు వస్తున్నాయి. కామెడీ నేపథ్యంలో సాగే ఈ లవ్‌స్టోరీని దర్శకుడు డేవిడ్ ధావన్ తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. జూలై చివర్లో షూటింగ్ ప్రారంభమవుతున్నదని, అక్టోబర్‌లో సినిమాను విడుదల చేయనున్నారట. అయితే దీనిపై అధికారిక సమాచారం రావాల్సి ఉన్నది.



# సల్మాన్, రజనీలతో అట్లీ మల్టీస్టార్

'జవాన్' విజయం తర్వాత దర్శకుడు అట్లీ చేయనున్న చిత్రంపై స్పష్టత వస్తోంది. ఆయన సల్మాన్ ఖాన్‌తో ఓ మల్టీస్టారర్ చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందులో మరో హీరోగా దక్షిణాది నటుణ్ని తీసుకోనున్నట్లు ఇప్పటికే వార్తలొచ్చాయి. ఇప్పుడీ పాత్ర కోసం అగ్ర కథానాయకుడు రజనీకాంత్‌ను రంగంలోకి దింపనున్నట్లు సమాచారం అందుతోంది. ప్రస్తుతం ఈ విషయమై రజనీతో చర్చలు జరుగుతున్నట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇది భారతీయ చిత్రసీమలో మరో క్రేజీ మల్టీస్టారర్‌గా నిలవనుంది. ఇప్పటికే ఈ చిత్ర స్క్రిప్ట్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. వచ్చే ఏడాదిలో సినిమాని పట్టాలెక్కించనున్నట్లు తెలుస్తోంది. దీన్ని సన్‌పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించనున్నారు. ప్రస్తుతం రజనీ నటించిన 'వేట్టయాన్' విడుదలకు సిద్ధమవుతుండగా.. 'కూలీ' చిత్రీకరణ ప్రారంభించుకోవాల్సి ఉంది.





# పెళ్లి ప్రచారాలకు నివేదా చెక్

నివేదా థామస్ పెళ్లి చేసుకోనున్నారంటూ వచ్చిన వార్తలకు చెక్ పడింది. సస్పెన్స్‌కు తెరదించింది. కొత్త చిత్రాన్ని ప్రకటించి రూమర్స్‌పై క్లారిటీ ఇచ్చారు. 'జెంటిల్ మేన్'తో తెలుగు తెరకు పరిచయమై తన నటనతో ఎందరో అభిమానులను సొంతం చేసుకున్న నివేదా ఇటీవల తన ఇన్‌స్టా స్టోరీలో 'ఎన్నో రోజుల తర్వాత.. ఫైనల్లీ' అని రాశారు. దీనికి లవ్ సింబల్‌ను జోడించారు. దీంతో ఈ హీరోయిన్ పెళ్లి పీటలెక్కనుందని జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా ఆ రూమర్స్‌కు చెక్ పెడుతూ 'చాలా రోజులు వేచి చూశారు. ఇది నా స్పెషల్ ఫిల్మ్' అని కొత్త సినిమాను ప్రకటించారు. దీంతో ఆమె పెట్టిన స్టేటస్ పెళ్లి గురించి కాదని.. కొత్త సినిమా గురించేనని క్లారిటీ వచ్చింది. ఇక ఈ చిత్రాన్ని నటుడు రానా నిర్మించడం మరో విశేషం. '35 – ఇది చిన్న కథ కాదు' అనే ఆసక్తికర టైటిల్‌తో తెరకెక్కనుంది. ఈ సినిమా పోస్టర్‌ను రానా ఎక్స్ వేదికగా పంచుకున్నారు. తిరుపతి నేపథ్యంలో జరిగే కథ అని.. అందరి హృదయాలను హత్తుకుంటుందని ఆయన తెలిపారు. ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకురానున్నట్లు చెప్పారు. ఈ చిత్రంతో నందకిశోర్ అనే కొత్త దర్శకుడు ఇండస్ట్రీకి పరిచయం కానున్నారు. ప్రియదర్శి, నివేదా థామస్ జంటగా నటిస్తుండగా సీనియర్ నటి గౌతమి ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు.